క్లుప్తంగా

ప్రారంభమైన భజన సంకీర్తనలు



భట్టిప్రోలు: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం నుంచి శ్రీరామనవమి వరకు అన్ని దేవాలయాల్లో శ్రీరామ జయరామ జయజయ రామ భజన సంకీర్తనలు ప్రారంభించారు. సంకీర్తన కార్యక్రమాలు వసంత నవరాత్రులు జరుగుతాయని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని రుక్మాభాయి సహిత పాండురంగస్వామి దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. పూజా కార్యక్రమాలను అర్చకులు ధారా నారాయణమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు



బోలాయపాలెం(కర్లపాలెం): బోలాయపాలెంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు జరిగాయి. కాశీవిశ్వేశ్వరస్వామి శివలింగానికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా కాశీ విశ్వేశ్వరస్వామి శివలింగానికి అర్ధనారీశ్వరుడి అలంకరణ చేశారు. పూజలనంతరం పంచాంగ శ్రవణం చేసి భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సారకాయలంకమ్మ దేవరకు ప్రత్యేక పూజలు



కర్లపాలెం: చింతాయపాలెం పంచాయతీ తూర్పుపాలెంలో ఉన్న పెదమల్లువారి కులదేవర సారకాయలంకమ్మ పుట్టవద్ద బుధవారం విశేష పూజలు జరిగాయి. పెదమల్లు రంగారావు, మార్కండేయులు, వెంకటరావు, అంకమ్మరావు ఆధ్వర్యంలో భక్తులు పుట్ట వద్ద పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు పసుపు కుంకుమలు చల్లి పూలు పండ్లు సమర్పించి పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడిపందేల రాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన రుద్రవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ విజయచంద్ర వివరాల మేరకు.. రుద్రవరం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామ సమీపంలోని పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,150 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా అమావాస్య హోమం

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో గ్రామంలో వేంచేసిఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 49వ అమావాస్య హోమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు మహాశక్తి స్వరూపిణిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారి హోమ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. సినీనటి మంజుభార్గవి అమ్మవారి హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి అమ్మవారి చిత్రపటాలను వారికి బహూకరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి టౌన్: ఉగాది పర్వదినం సందర్భంగా ఆంజనేయం ధ్యాన యోగమండలి ఆధ్వర్యంలో రత్నాటాకీస్ సెంటర్‌లోని రైతుబజారులో బుధవారం తులసి ఆకుల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యోగాచార్యులు కిషోర్ గురూజీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి తాడిబోయిన శివరామకృష్ణ ప్రజలకు తాగునీరందించారు. ఈసందర్భంగా కిషోర్‌గురూజీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది పర్వదినం రోజున తులసి ఆకులు, లవంగం పొడి కలిపి మట్టికుండలో భద్రపరిచిన మినరల్ వాటర్‌ను బాటసారులు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. యోగ సభ్యులు పురుషోత్తమ కృష్ణస్వామి, చెంచయ్య స్వామిల వితరణతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తాడికొండ శ్రీనివాసరావు, గుప్తా స్వామిజీ, ముంతా శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, సుబ్బారావు, సుజాత, ప్రసాద్, శాంతి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

‘శోభకృత్’కు ఘన స్వాగతం

భట్టిప్రోలు: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం గావించారు. భట్టిప్రోలు గ్రామ దేవత దండిపార్వతి అమ్మవారిని గౌడ సంఘం ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగించారు. అద్దేపల్లి గ్రామ దేవత ఆడెమ్మ అమ్మవారికి కూడా అద్దేపల్లి పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో పోలన శివశంకర రావు సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహాగణపతి, లక్ష్మి గణపతి పూజా కార్యక్రమాలు జరిగాయి. వంగర చలమయ్య సిద్ధాంతి పంచాగ శ్రవణం చేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వెల్లటూరులో కొలువైన అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో కూడా పంచాంగ శ్రవణం జరిగింది. కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. పెదపులివర్రులో కొలువైన గోగులమ్మ, వెల్లటూరులో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

చినపరిమిలో పంచాంగ శ్రవణం

చుండూరు(భట్టిప్రోలు): ఉగాది పర్వదినం సందర్భంగా చుండూరు మండలం చినపరిమిలో కొలువైఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివార్లకు బుధవారం పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం మామిళ్లపల్లి సత్యన్నారాయణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులు పంచాంగ శ్రవణాన్ని ఆలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సోమేశ్వర దేవాలయంలో..

బాపట్ల: బాపట్లలోని గంగా పార్వతి సమేత సోమేశ్వర దేవాలయంలో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘు పతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉగాది పంచాంగ శ్రావణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థా నం చైర్మన్ కోళ్లపూడి శివరాం ప్రసాద్, కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు గ్రామ దేవత దండిపార్వతి అమ్మవారి గ్రామోత్సవం

చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి: మండలంలోని దేవాలయాల్లో శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రముఖ వేద పండితులు ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మ పంచాంగ పఠనం చేశారు. పలు ఆలయాల్లో ఆయా వేదపండితులు పంచాంగ శ్రావణం గావించి పంచాంగ పుస్తకాలు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో మండల బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు, ఈఓ శ్రీనివాసవర్మ, పలు దేవస్థానాల ట్రస్ట్ బోర్డు చైర్మన్‌లు మద్దుల శ్రీనివాసరావు, అవ్వారు రామారావు, మొగలిపువ్వు నాగేశ్వరరావు, రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది పర్వదినం

రేపల్లె రూరల్: శోభకృత్ సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకలు నియోజకవర్గంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని గ్రామదేవత ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవలతో కూడిన అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా పంపిణీ చేశారు. వివిధ సేవా సంఘాల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు.

దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో..

పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య అధ్యక్షుడు వడ్లమూడి ఉదయ్‌ప్రసాద్ అధ్యక్షతన ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. అప్పాజ్యోసుల దక్షిణామూర్తి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం పలువురు వైద్యుడు దూళిపూడి స్వర్ణమోహన్‌కు, న్యాయవాది శ్రీనివాసహరికి, పండితులు దక్షిణామూర్తికి సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పీఎస్‌టీ శర్మ, గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు, కోశాధికారి రొంపిచర్ల విజయసారథి, బ్రాహ్మణ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ కొండవీటి అగస్త్య తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో ప్రత్యేక అలంకరణలో బూరుగలమ్మ అమ్మవారు

మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవుతా సత్యవెంకట నాగరాజేష్ పంచాంగ శ్రవణం చేశారు. వేదాంతం భవానీ రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఏ సభ్యులు ప్రభల సుబ్రహ్మణ్యం, వాసుదేవరావు, వి.సాంబశివరావు, కె.రామస్వామి, కె.సాయి ప్రసాద్, వి.లక్ష్మీనారాయణ, చక్రపాణి, ఎస్.లోకేశ్వరరావు, కేవీ సుబ్బారావు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నిజాంపట్నం: ఈ సంవత్సరం వానలు బాగాకురిసి పంటలు సమృద్ధిగా పండాలని ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా గోకర్ణమఠం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ పంచాంగ శ్రావణం వల్ల దోషాలు తొలగి విజయాలు లభిస్తాయని తెలిపారు. ఉగాది ప్రత్యేక పూజలు నిర్వహించి, కుండలో ఉగాది పచ్చడి చేసి పంచారు. అనంతరం గ్రామంలో కాషాయ జెండాలతో శోభయాత్ర నిర్వహించి ఇంటింటికీ హనుమధ్వజాన్ని పంచారు. కార్యక్రమంలో పడమటి వెంకటేశ్వరరావు, కాశేపల్లి గౌరీశంకర్, మోపిదేవి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ ఉమ తదితరులు పాల్గొన్నారు.



చందోలులో పంచాంగ దాతలను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా శోభకృత్ ఉగాది వేడుకలు

పిట్టలవానిపాలెం: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తిన్నారు. చందోలు బండ్లమ్మ దేవాలయం, అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ఖాజీపాలెం కాశీవిశ్వనాథ స్వామి దేవాలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

బండ్లమ్మ దేవాలయంలో..

చందోలు గ్రామంలో వేంచేసిఉన్న బండ్లమ్మ దేవాలయంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పండితులు శర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు తేజ ఎంటర్‌ప్రైజెస్ వారు అందజేసిన పంచాంగాలను అందజేశారు. బాపట్ల శాసనసభ్యుడు కోన రఘుపతి దేవాలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించున్నారు. అనంతరం బండ్లమ్మవారి యూట్యూబ్ చానెల్ లోగోను ఆవిష్కరించారు. వారి వెంట ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారావు, శివకేశవులు ఉన్నారు.

అల్లూరులో..

అల్లూరులో వేంచేసిఉన్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉత్పల అనంతరామ్ పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి పండితులను ఘనంగా సత్కరించారు. మండే రామదాసు జ్ఞాపకార్థం ముద్రించిన శోభకృత్ నామ సంవత్సర ఉగాది పంచాంగ పుస్తకాలను భక్తులకు వారి వంశీకులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్ అందజేశారు.



చెరుకుపల్లి పోలేరమ్మ దేవస్థానంలో పంచాంగ శ్రవణం చేస్తున్న ఆర్‌వీఎస్ ఆంజనేయశర్మ



చినపరిమిలో పంచాంగ శ్రవణాన్ని ఆలకిస్తున్న భక్తులు



రేపల్లెలో పండితులు దక్షిణామూర్తిని సత్కరిస్తున్న దత్తాత్రేయ సంక్షేమ సమాఖ్య సభ్యులు



నృత్యప్రదర్శనలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంసీఏ సభ్యులు



కాషాయ జెండాలతో శోభయాత్ర నిర్వహిస్తున్న జంజనం హేమ శంకరరావు

ప్రముఖులకు సన్మానం

బాపట్ల అర్బన్: సాహితీ భారతి, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ కార్యాలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ప్రముఖులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, కార్యదర్శి శ్రీహరిరావు ప్రముఖులను సన్మానించారు. ప్రముఖ రచయిత గ్రోసంస్థ అధ్యక్షుడు బందా బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కవిత విశారద దీవి శ్రీనివాసమూర్తి, రిటైర్డ్ తహసీల్దార్ ఎస్.సిద్దయ్య, వెటర్నరీ డాక్టర్ బి.సింగారావు, ప్రముఖ సంఘ సేవకులు సాహితీ భారతి సంయుక్త కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ప్రముఖ రంగస్థల నటుడు సోమరాజు శ్రీనివాసరావు, విశ్రాంత ఎంఈఓ బోలగాని వెంకటేశ్వర్లు తదితరులకు ఘన సన్మానం నిర్వహించారు. ప్రముఖులు ఉగాది విశిష్టతను తెలియజేశారు. ఉగాది పర్వదిన విశిష్టతను కవిత విశారద దేవి శ్రీనివాసమూర్తి వివరించారు. సాహితీ భారతీ అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, బి.సింగారం పాల్గొన్నారు.



ప్రముఖులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని 13వ వార్డులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయ భవనాన్ని ఉగాది సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు-అరుణ భాస్కరి దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సంరద్భంగా మోపిదేవి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలకు కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటానని, తమ సమస్యలను తెలుపుకునేందుకు ఏ సమయంలోనైనా తన వద్దకు రావచ్చని చెప్పారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. తొలుత నిర్వహించిన వేడుకల్లో వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి దంపతులను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం కోటేశ్వరమ్మ దంపతులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ అల్లంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మోపిదేవి వెంకట రమణరమణారావు, అరుణ భాస్కరి దంపతులను సత్కరిస్తున్న నాయకులు

• కుంచె కదిపితే సజీవ చిత్రమే



శ్రావణ్‌కుమార్ కుంచె నుంచి జాలువారిన చిత్రాలు

భట్టిప్రోలు తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్ తన సృజనాత్మకతతో అవలీలగా చిత్రాలను గీస్తారు. ఆయనకు చిన్ననాటి నుంచి చిత్రకళపై ఎంతో ఆసక్తి. తన దృష్టిని ఆకట్టుకున్న ఏ చిత్రమైనా ఇట్టే క్షణాల్లో కాగితంపై రూపు దిద్దుకుంటుంది. ఆయన చేతిలో కుంచె నాట్యం చేస్తుంది. తీరిక వేళల్లో ప్రవృత్తిగా చిత్రాలకు ప్రాణం పోస్తుంటారు. ఇప్పటికీ వేలాది చిత్రాలను చిత్రించినట్లు చెప్పారు. – భట్టిప్రోలు





పేద రోగులకు అండ

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

రేపల్లె: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదం చేస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులబారిన పడి చికిత్సలు పొందనేలా రోగులను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు కొక్కిలిగడ్డ సత్యనారాయణకు రూ. 2,00,000, విశ్వనాథపల్లి శ్రీనివాసరావుకు రూ. 2,00,000, కర్రి శివమల్లేశ్వరరావు రూ.1,40,000, లంకే రాధకు రూ.42000, విశ్వనాథపల్లి వెంకట కుమారికి రూ.2,40,000, దొంతుబోయిన లక్ష్మీపార్వతికి రూ.1,20,000ల చెక్కులను పంపిణీ చేశారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి..

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్) ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ (బాపట్ల-ఏపీఎంసీఏ) సభ్యులు స్థానిక పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాపట్ల ఏపీఎంసీఏ అధ్యక్షుడు పులి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనల ప్రకారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులరైజ్ చేసే వెసులుబాటు రాష్ట్రాలకే అప్పగించిందని, జీతభత్యాలలో కూడా 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, కాబట్టి సీహెచ్‌ఓలను రెగ్యులరైజేషన్ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదన్నారు. స్పందించిన మోపిదేవి మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యక్షురాలు షైనీ మేఘన, జిల్లా కార్యదర్శి ప్రమోద్, నియోజకవర్గ ఇన్‌చార్జి సుజీవిని రాణి, సభ్యులు ప్రిస్కిల్లా, లావణ్య, బేబీ రాణి, ప్రభువా, రామారావు, ప్రవీణ్, రాజ కృపానిధి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

ఘనంగా భారతరత్న బిస్మిల్లా ఖాన్ జయంతి

బాపట్ల అర్బన్: పట్టణంలోని అంజుమన్ కాంప్లెక్స్‌లో గల బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు గంట అంజిబాబు ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో భారతరత్న ప్రఖ్యాత షెహనాయి విద్వాంసులు బిస్మిల్లా ఖాన్ 107వ జయంతి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత జూడో యాత్రలో బిస్మిల్లా ఖాన్ కుటుంబ సభ్యులు పాల్గొని రఘుపతి రాఘవ రాజా రామ్ రాగాన్ని ఆలపించటం హర్షణీయమన్నారు. కాశీ విశ్వేశ్వర ఆలయానికి 62 ఏళ్ల పాటు ఆస్థాన విద్వాంసులుగా పనిచేసి, షహనాయి వాయిద్యానికి తిరుగులేని రారాజుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నక్కల రాంబాబు, శీలం సాగర్, బి.రోశయ్య, ఆంధ్రు రాజు, రవి రాజు, కట్టా లాజర్, గడ్డం ఇసాక్, చింత బాబురావు, మహిళా నాయకులు దండు రేణుక, హైమావతి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



బిస్మిల్లాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు

నిజాంపట్నం: పల్లవసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి మరింత ఉత్తేజపరచడం హర్షణీయమని సర్పంచ్ కొక్కిగడ్డ రవి తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పల్లవసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కొత్తపాలెం గ్రామంలోని మహాత్మా జ్యోతీబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కొక్కిలిగడ్డ రవి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రోత్సాహక బహుమతులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కొల్లాటి ఈశ్వరి, ఎం.నందిని, స్నేహశ్రీకి నగదు బహుమతులను అందిచారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవసరమైన స్టేషనరీని అందించారు.



బహుమతులు అందిస్తున్న సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, పల్లవసేన సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఆదర్శనీయులు గరుడాచలం నాయుడు

ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల: పేరం గరుడాచలంనాయుడు వంటి దాతలు సమాజంలో అరుదుగా ఉంటారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పేరం గరుడాచలంనాయుడు తూర్పుసత్రంలో ఉగాది రోజు పంచాంగ శ్రావణం చేసి విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమం ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పేరం గరుడాచలం నాయుడు ఎంతో దూరదృష్టితో తన ఆస్తిని సైతం ప్రజల ఉపయోగార్థం ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. చదువుపై ఆయన ముందుగానే ఆలోచించి ఉపకారవేతనం అందించాలని తీర్మానించటం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో తూర్పుసత్రం ఈఓ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

గోదాము పనులు నిలిపివేత

యడవూరు(వేమూరు): అనుమతులు లేకుండా చేపట్టిన గోదాము నిర్మాణ పనులను అధికారులు నిలిపివేశారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామానికి చెందిన కుర్రా రాఘవేంద్రరావు గ్రామంలో ప్రైవేట్ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో బొంత మురళి అనే వ్యక్తి రెండు ప్లాట్‌లు కొనుగోలు చేశారు. ప్లాట్లలో బుధవారం గోదాము నిర్మాణం పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆ పనులను నిలిపివేయించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ల్యాండ్ కన్వర్షన్ కాని దృష్ట్యా వేమూరు రెవెన్యూ అధికారులు గోదాము పనులను నిలిపివేయించారు. ల్యాండ్ కన్వర్షన్ అనుమతి వచ్చిన తర్వాతే గోడౌన్ నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు పనులు చేపట్టరాదన్నారు. అనుమతి లేకుండా పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జంపని వీఆర్వోలు కూచిపూడి గోపి, మునిపల్లి లత, పులి సీతయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.